# కర్ణపిశాచి

శైశవ మిత్రుడైన గోపీవల్లభరావు వృద్ధిలోకి వచ్చి ఇంతో అంతో జనబాహుళ్యంలో పేరు తెచ్చుకున్నాడంటే, నేను గుర్తించడానికి బదులు ఆశ్చర్యపోయాను. ఆశ్చర్యమంటే ఏదో స్వల్పంగా కాదు. అత్యాశ్చర్యం!.

గోపీవల్లభరావుకి వచ్చిన పేరు వ్యాసరచయిత గానూ, స్థానికంగా జరిగే సభల్లో వేదికలపై ఉపన్యాసకుడుగానూను.

"ఫలాన తేదీన 'ప్రముఖ స్థానిక వర్తకులు' కాలగతి నొందిరి కాబట్టి, వారి ఆత్మశాంతి నిమిత్తమూ సాయంత్రం 5గంటలకు బహిరంగ సంతాప సభ జరుగును. ఆ సంతాపసభకు శ్రీయుత గోపీవల్లభరావుగారు అధ్యక్షత వహించుటకు దయతో నంగీకరించిరి. పురజనులు యావన్మందీ విచ్చేసి సభను జయప్రద మొనరించ ప్రార్థన" అని పంచిపెట్టిన హస్తపత్రాల్లో, పొరుగూరులో పంతులు వృత్తి చేస్తున్న నాహస్తంలో ఒకటి పడ్డది! చచ్చి స్వర్గానికెళ్ళిన వర్తక ప్రముఖుని మాటకేంగాని నా చిరుతకూకటి చెలికాడు అధ్యక్షునిగా ఉపన్యసిస్తాడంటే సభకు వెళ్లబుద్ధి వేసింది. ఇప్పుడు గోపీవల్లభరావు ఎలా ఉన్నాడో? మాటల ధోరణి, నడత, సౌమ్యస్వభావమూ ఎల్లా ఉన్నవో ఏమో?

పొన్నూరులోనే పనిచేస్తున్న నేను, సొంతపని మీదనో సంతపనిమీదనో స్వస్థలానికి వచ్చేవాడిని. నా స్వస్థలమే గోపీవల్లభరావు స్వస్థలంకూడా. భుక్తికి గడవక ఉద్యోగనిమిత్తం స్వస్థలాన్ని విడిచి పెట్ట వలసి వచ్చిందినేను. ఎటొచ్చీ గోపీవల్లభరావుకి పిత్రార్జితం కొంత ఉంది కాబట్టి, నాకు మల్లే స్వస్థలాన్ని విడిచిపెట్టి పోయేటంత దురవస్థ ఎంతమాత్రమూ పట్టలేదు. నేను స్వస్థలానికి

పనిమీద వచ్చినపుడల్లా గోపీవల్లబరావు జ్ఞాపకానికి వచ్చినమాట వాస్తవమే కాని 'చూద్దాంలే తొందరేమిటి' అని బద్ధకంతో ఒకమాటూ, 'చూసేదేమిటి జిడ్డుమొహాన్ని' అని నిర్లక్ష్యభావంతో ఒకమాటూ చూడ్డం మానేస్తున్నాను.

అటువంటిది ఇన్నాళ్ళకు మళ్లీ వాడిని చూసి, ఉపన్యాసానికి వెళదామని నాకు బుద్ధి పుట్టిందంటే నలుగురిలోనూ పేరు తెచ్చుకోగలగుతున్నాడనేమో?

నిజమే, ఆదిలో ఇవరూ ఎవర్నీ గుర్తించరు. విద్యాధికునిగానో, ప్రముఖ సాహితీవేత్తగానో దేశంలో పేరు తెచ్చుకుంటూంటే అప్పుడందరూ అంటారు: "అరే! వేణుగాడింత వాడయ్యాడా! కేలిఫోర్నియాలో రీసెర్చి స్కాలరై, డాక్టరేట్ సంపాయించాడే! నా ఎదుట గోచిపాత కట్టుకొని ముక్కెంబట చీమిడి గారుతూ ఉండేవాడు!'

"తస్సాదియ్యా! విశ్వనాథంగా డింతవాడయాడా? డెబ్బయి పుంజీలసార్లు స్కూల్ ఫైనలు తగులబెట్టాడు. వాడు నాక్లాసుమేటయ్యా బాబూ! నాలుగూ నాలుగూ కూడితే ఎంతరా అంటే "నన్నెందు కడుగుతారు మేష్టారూ! ఈ మాత్రం మీకు తెలియదా?" అనేవాడు బ్రభ్రాజమానం. ఏవో పిచ్చిపిచ్చికైతల గీతలుగీస్తూ ఉండేవాడు. అటువంటిది, పత్రికా సంపాదకుడయిపోయి, కొల్లలుగా రచనలు సృష్టిస్తూ ఎంతపేరు తెచ్చేసుకున్నాడు!"

పేరు తెచ్చేసుకున్నాట్ట! అంగడిలో పప్పూ బియ్యం కొని తెచ్చేసుకున్నట్టే! డబ్బుకాదిది, ఒకణ్ణి మోసగించో, హత్యచేసో సంపాదించడానికి! పాదనూపురోద్రేక ఝుళం ఝుళార్భటులు దిక్కుల పిక్కటిల్లగా జిహ్వాపై వాగ్దేవిచేసే లాస్యం ఇది!

ఎట్టకేలకు నిర్ణీత కాలానికి గోపీవల్లభరావు ఉపన్యాసానికి హాజరయ్యాను. సూక్ష్మంలో వాడి అధ్యక్షోపన్యాస సారాంశం:

"సోదరులారా! మనం స్థానికంగా ఒక వణిక్ ప్రముఖుణ్ణి కోల్పోయాం. దాన ధర్మాలకు నిధి ఆయన. న్యాయానికి ఆలవాలము. ప్రేమ సమాజపు పేద సభ్యులు ఐదువందల మందిని దినదినమూ పోషించే వాళ్లల్లో ఈయనొకరు. విదేశస్థులకు, హొటళ్లలో ఉండడానికి రోజుకి రెండేసి రూపాయలు హొటలు యజమానులు వసూలు చేయడం గమనించి, ఆ విదేశీయులు ఆర్థికంగా ఇబ్బందులకు లోను కావలసి వస్తూందని గ్రహించి, ఈ వణిక్ ప్రముఖులు

బ్రహ్మాండమైన ఒక సత్రం కట్టించారు. అందులో ఎవరైనా సరే నాలుగు రోజులు ఉచితంగా ఉండవచ్చు. భోజన భాజనాదులకు సైతమూ ధనం వెచ్చించ వలసిన అవసరం లేదు. ఇట్టి మహాధార్మికుడు స్వర్గస్థులై నారంటే ఎంతో విచారించవలసిన విషయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని సదా ఆ భగవంతుణ్ణి ప్రార్థిద్దాం. ఒక్కక్షణం దయచేసి, అంతా నిలబడి, నిశ్శబ్దంగా భగవత్ప్రార్థన చేయండి."

అంతా లేచి నిలబడి రెండు నిమిషాలపాటు మౌనం వహించాము. గోపీవల్లభరావు తల పంకించగానే అంతా కూర్చుండి పోయాం.

రెండు రోజులు పోయాక ఒక దినపత్రికలో గోపీవల్లభరావు ఇచ్చినపై ఉపన్యాసం, ఇంకా వివరంగా, వ్యాసరూపేణా ప్రచురించ బడ్డది. ఈ విధంగా ఇతడు వ్యాసరచయితగా చలామణి అవుతున్నాడు.

మరోనాడు కూడా ఒక ఉపన్యాసానికి హాజరయ్యాను. అదికూడా, ఈ లోకాన్ని విడిచి వెళ్లిన ఒక ఆత్మకు శాంతి చేకూరాలనే! నెమ్మదిగా, విచార గ్రస్తంగా గోపీవల్లభరావు అన్నాడుః

"సోదర సోదరీ మణులారా! ఈ నాడు మనం, ఒక గొప్ప కథకుడు, కవి ఐన ఆత్మీయుణ్ణి కోల్పోయాం. ఇది నిజంగా మన దురదృష్టం అని చెప్పక తప్పదు. తన కవిత్వం ద్వారానూ, కథల ద్వారానూ, ప్రజలకు, తన అమూల్య, అపూర్వ సందేశాల నందిచ్చే ప్రముఖ సారస్వతోపాసకుడు అకాల మ రణానికి గురి అయినాడంటే, ఏమనాలో తెలియడంలేదు. పాపీ చిరాయు, సుకృతీ గతాయుః అని పురాణోక్తి. నిజమే, పాపాత్ముడు చిరంజీవి. సుకృతాత్ముడు క్షణజీవి. ఇదంతా ఆ భగవంతుని విలాసం. మనం చేసేదేమీ లేదు.

ఇహ అతను తన కావ్యాల్లోనూ, కథల్లోనూ వెలిబుచ్చిన అభిప్రాయాలకు జోహారు లర్పించవలసిందే! భావాలన్నీ రత్న మాణిక్యాలు. ఇందుకు సందేహంలేదు" అంతా లేచి నిలబడి యధావిధిగా రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం వహించాము.

రెండు రోజులు పోయాక ఇదే ఉపన్యాసం ఒక దినపత్రికలో, సవివరంగా, వ్యాసరూపేణా ప్రచురించ బడ్డది. నేను ఎంతగానో ఆశ్చర్య పోయాను.

గోపీవల్లభరావుని గురించి నా కొక గొప్ప అనుమానం స్ఫురించింది. ఇట్టి ఈ అనుమానం నాకేకాని, ఇతరులకు స్ఫురించి ఉంటుందని నే ననుకోను.

స్ఫురించి ఉంటే, గోపీవల్లభరావు వ్యాస ఉపన్యాసాన్ని గురించి, ఏ ఒక్కరైనా తప్పక పరిశోధన చేసి ఉందురు. అందుకే 'అది' నాకే స్ఫురించిందని ధాటిగా చెప్పగలను.

'అది' ఏమిటీ అంటే పత్రికలలో ప్రచురితమైన గోపీవల్లభరావు వ్యాసాలు అన్నీకూడా ఎవరో మరణించిన ప్రముఖుల ఆత్మశాంతికోసమే. నేను అవన్నీ పత్రికల్లో చూశాను. ఉపన్యాసాలంటే ఒకే ఒక్కస్థలంలో జరగడం వలన ప్రతిదానికీ హాజరయ్యే అవకాశం లేకపోవచ్చుగాని, పత్రికల్లో ప్రచురించబడ్డ వ్యాసాలన్నింటినీ చదవడానికి ఆటంకం ఏమిటి? పైగా నేనెక్కడ ఆశ్చర్యం పడుతున్నానంటే, పేరు ప్రఖ్యాతులు గడించిన ఏతత్ర్పముఖులు ఉదయం మరణిస్తే, సాయంత్రానికల్లా ఆ స్వర్గీయుని గురించి గోపీవల్లభరావు ఉపన్యాసం! ఇదికాక, ఈ ఉపన్యాసాలే, వ్యాసరూపేణా పత్రికల్లో మరో రెండు రోజులకల్లా ప్రచురించ బడతాయి. ఇందులో దివంగత ప్రముఖుని బాల్య, యౌవన, కౌమార, వార్థక్య దశలూ, అతను వ్యాపారి ఐతే వ్యాపారకృషి, కవి ఐతే కవనకృషి, చిత్రకారుడైతే చిత్రలేఖన కృషి, ప్రతిపదటీకా తాత్పర్య సహితమూ దినపత్రిక సైజులో, రెండు పుటలకు తక్కువ వ్రాయడు గోపీవల్లభరావు. ఈ స్వర్గీయ ప్రముఖులయొక్క జీవిత విశేషాలూ, అనుభవాలూ, గోపీవల్లభరావు ఎంత త్రుటిలో సేకరించేస్తాడా అని పెద్ద ఆశ్చర్యం నాకు! చచ్చినవాడు కవి ఐతే అతని కావ్యాలన్నీ సమగ్రంగా పఠించి ఉండాలి. ఎక్కడెక్కడ గొప్ప భావాలున్నాయో అవన్నీ గుర్తించు కోవాలి! ఇంత శ్రమ పడాలి. ఎట్టి వ్యాసరచయితకైనా, స్వర్గీయ కవియొక్క జీవిత విశేషాల సేకరణకు నెల రోజులైనా గడువు అవసరం!

అటువంటి కష్టతరమైన పనిని గోపీవల్లభరావు కొన్ని గంటల్లో సేకరించేస్తాడు! ఇదే ఇతనిలో గొప్ప విశేషం!!!

ఈ విశేషం ఏమిటో వాడినే అడిగి తెలుసు కోవాలని, వాడొకవేళ చెప్పడానికి అయిష్టపడితే, ఏదో డొంకతిరుగుడు ప్రశ్నలు వేస్తూ తత్సంబంధమైన సంభాషణల్లోకి దింపి కూపీ తీద్దామని అనిపించింది నాకు. కాని తీరా వాడింటికి వెళితే "చాలాకాలంనుంచి కనబడని వాడివి, ఇవాళే కనబడ్డావేం? ఇవాళేనా నేను గుర్తు కొచ్చింది? ఏదో ఇంతో అంతో పేరు తెచ్చుకుంటున్నానని కాబోలు, మళ్లీ పూర్వపు స్నేహాన్ని స్మృతికి తేవాలని వచ్చావు పాపం!' అని పెదవులు

విరుస్తాడేమోననే అనుమానం కలిగింది నాకు. అదీగాక మరోపాయింటుః తనింత పెద్దవాడయినందుకు వీణ్ణి పలకరించేదేమిటని 'నువ్వెవరో నాకు తెలీదు' అన్నాడంటే ఇహ నేను కప్పు కాఫీలో పడి చావాల్సిందే!

నాకు అంచేత వాడింటికి వెళ్లబుద్ధి పుట్టలేదు. తిరిగి నేను నా ఉద్యోగ స్థలానికి చేరుకుని, భగవన్నిర్ణయ నిత్యకర్మమైన పంతులువృత్తితో పెద్ద బాలశిక్ష చెప్పుకు పోతున్నాను.

నా ఉద్యోగపుటూరు చేరిన వారం రోజులకే, ఒక రవివారం నాడు, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూండగా-

గోపీవల్లభరావు నాడే హఠాన్మరణానికి గురి అయ్యాడని ఈ నోటా ఆ నోటా ప్రాకి, నా శ్రవణాలకు సోకింది. నా గుండె బేజారయి పోయింది! వెంటనే నిల్చున్నపాటుగా, గోపీవల్లభ రావు మృతకాయాన్నైనా చూసి వద్దామని బయల్దేరాను.

అవివాహితుడైన గోపీవల్లభరావు స్వగృహంలో వైధవ్యం అనుభవిస్తూ తన్నాశ్రయించుకున్న ఒక సోదరి రోదిస్తూండగా, సజీవులైన పుర ప్రముఖులు పరామర్శకు విచ్చేసి హాహాకారాలు చేయడం జరిగింది.

దహనాది సంస్కారాలు జరిగిపోయిన తర్వాత గోపీవల్లభరావు అక్కయ్యని కలిశాను. ఆమె నన్ను గుర్తుపట్టి గౌరవంగానే మాట్లాడింది. సోదరుని మరణదుఃఖాన్ని దిగమ్రింగుతూ నేనూ సోదరుని వంటి వాడినే కావడం వల్ల.

తరువాత ఏదో మాటల సందర్భంలో, గోపీవల్లభరావు ఇంతకు ముందు వ్రాసి ప్రచురించిన వ్యాసాలూ, ప్రస్తుతం, అంటే మరణపర్యంతం సగం వ్రాతలో నిల్చిపోయిన వ్యాసాలూ, చూపించమని సోదరిని కోరాను. ఆ కట్టంతా తెచ్చి నాదగ్గర పడేసిందామె. అందులో కొన్ని ఉత్తరాలు కూడా ఉన్నాయి.

గోపీవల్లభరావుపై నాకు కలిగిన ఆశ్చర్యయుత అనుమానానికి సమాధానం దొరికింది.

పత్రికల్లో ధారాళంగానూ, బహుళంగానూ, ఉన్నతస్థాయినీ, ఉన్నత సంఖ్యనీ రచనలు చేస్తూ ప్రస్తుతం సజీవంగా ఉన్న రచయితల రచనలన్నీ ఒకొక్కరివీ ఒకడజను సేకరించి, ఆయా రచనల్లోని మంచి చెడ్డలు, తర్జన భర్జనలూ వ్రాసుకున్నాడు. తద్రచయితలతో, వారి రచనల్ని పొగుడుతూ, ఉత్తర

ప్రత్యుత్తరాలద్వారా పరిచయం చేసుకుని, ఏదో సరదాతో వారి జీవిత విశేషాలను తెలుసుకోవాలనే కుతూహలంతో అడిగినట్లు, జీవిత విశేషాలను కూడా అడిగి తెలుసుకుని, వ్యాసాలు వ్రాసి సిద్ధం చేసుకున్నాడు. వీళ్లలో ఏ ఒక్కడు, ఎప్పుడు మరణించినా, వీళ్ల జీవితాన్ని గురించి తను వ్రాసిన వ్యాసాంతంలో "ఇట్టి మహామేధావి అకాల మరణానికి గురి కావలసి వచ్చింది. ఇదెంతో మనకు విచారించ వలసిన విషయం" అనే వాక్యంతో, ఆ అసంపూర్ణ వ్యాసాన్ని పూర్తి చేస్తాడు!! ఇలాగే ఇతర రంగాల్లో కృషి చేస్తున్న వారిని గురించి కూడా! గడుసు ఘటం! ఎలా ఉందంటారు గోపీవల్లభరావు ఐడియా?

సోదరివద్ద సెలవు తీసుకుంటున్నప్పుడు ఆమె నడిగాను, గోపీ వల్లభరావు రచనలు వాడి జ్ఞాపకార్థం నావద్ద నుంచుకుంటానని. ఆమె అందుకు సమ్మతించ లేదు సరికదా, వాటిని నా సమక్షంలోనే కాల్చి పారేసింది.

ఇంటికి బయలు దేరాను. అప్పటికే సాయంత్రమైంది. పార్కులో బహిరంగ సంతాప సభ. ఒక్కక్షణం ఆగాను.

"గోపీవల్లభరావు గారు గొప్ప సూక్ష్మగ్రాహి కొండంత వానిపై కొండంత వ్యాసం త్రుటిలో వ్రాస్తారు. చనిపోయిన ప్రముఖుని జీవిత విశేషాలు ఎప్పుడు, ఎల్లా సేకరించి, ఒక్కమాట పొల్లుపోకుండా వ్రాసేస్తారో చెప్పనలవికాదు ఏదైనా దేవతారాధన చేసి కర్ణపిశాచ విద్య నభ్యసించారేమో!?" అన్న మాటల్ని వింటూ నవ్వుకున్నాను.

• ఆంధ్రప్రభ వీక్లీ •

*20.1.1960*